
సాగునీటిపై గురి

- ప్రతి ఎకరాకు నీరందించేందుకు ప్రణాళిక
- పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తితో పాటు..
- ప్రాజెక్టుల నుంచి చెరువులకు నీరందించే యత్నం
- జిల్లాలో తొలివిడతలో 65 చెరువులకు నీరు
- డీపీఆర్ తయారీలో అధికారులు

సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధితో ముందుకు దూసుకెళుతోంది. ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటి అమలు చేస్తోంది. దీపావళి నుంచి ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పథకం అమలు కానుంది. పల్లెసీమల్లో అభివృద్ధి పనులు ఇప్పటికే ముమ్మరంగా సాగుతున్నాయి. తాజాగా ప్రభుత్వం సాగునీటిపై దృష్టి సారించింది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిశాయి. ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయి. కాల్వల పూడికతీత, గేట్లు ఇతర మరమ్మతుల పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. మరోవైపు ప్రాధాన్యం ప్రకారం సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయనున్నారు. దీంతోపాటు రిజర్వాయర్ల నుంచి చెరువులకు నీరందించాలని నిర్ణయించారు. దీనిద్వారా చెరువుల పరిధిలోని ఆయకట్టుకు నేరుగా నీరందడమే కాకుండా భూగర్భజలాలు పెరగడంతో చుట్టుపక్కల ఉన్న బోర్లు రీచార్జ్ కానున్నాయి. దీంతో బీడు భూములన్నీ పచ్చని పంటలతో కళకళలాడనున్నాయి.



ఒంటిమిట్టలో లిఫ్ట్ ఇరిగేషన్

(కడప-ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రిజర్వాయర్ల నుంచి చెరువులకు నీళ్లందించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఇందుకోసం రూ.1000 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో భాగంగా తొలివిడతలో జిల్లాలో 65 చెరువులకు నీరందించాలని నీటిపారుదలశాఖ అధికారులు భావించారు. ఈ మేరకు ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపించారు. దీనికి సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేసేందుకు నీటిపారుదలశాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు.

ప్రాజెక్టుల్లో నీరున్నా..

అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నచందంగా జిల్లా రైతాంగ పరిస్థితి తయారైంది. ఉమ్మడి జిల్లాలో 82.255 టీఎంసీల సామర్థ్యం గల ప్రాజెక్టులున్నాయి. వీటిలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ప్రస్తుతం జిల్లాలో 7లక్షల ఎకరాలకు పైగా సరిపడా 50 టీఎంసీల నీరు ప్రాజెక్టుల్లో ఉంది. అయితే పంట కాల్వలు లేని కారణంగా ప్రాజెక్టుల్లో నీరున్నా నేరుగా చివరి ఆయకట్టుకు సాగునీరందడం లేదు. కొంతమేర లిఫ్ట్, గ్రావిటీ ద్వారా నీరు అందిస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

జిల్లా రైతాంగానికి తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలోని బ్రహ్మంసాగర్ ద్వారా 1.50లక్షల ఎకరాలకు నీరందించాల్సి ఉంది. అయితే ప్రధాన కాల్వలు, పిల్ల కాల్వలు లేకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. దీంతో తెలుగుగంగ, లోయర్ సగిలేరు ప్రాజెక్టు (ఎల్‌ఎస్పీ)ల ద్వారా నేరుగా చెరువులకు నీరందిస్తున్నారు. దీనిలో కొన్ని లిఫ్టులు కూడా ఉన్నాయి. తెలుగుగంగ నుంచి 127 చెరువులకు, ఎల్‌ఎస్పీ నుంచి 46 చెరువులకు నీరందిస్తున్నారు. ఇందులో తణుకువాగుకు లిఫ్ట్‌ద్వారా నీరు చేరుతోంది. పీబీసీలో 23 చెరువులకు, మైలవరం నుంచి 5, గండికోట నుంచి 13, పీబీఆర్ నుంచి 17, కేసీ కెనాల్ నుంచి మిగిలిన చెరువులకు నీళ్లు అందిస్తున్నారు. ఇటీవలే పాపాఘ్ని నుంచి కమలాపురం, వల్లూరు, వీఎన్‌పల్లె లోని 22 చెరువులకు నీరిచ్చారు.

తొలివిడతలో 65


జిల్లాలో 590 చెరువులున్నాయి. వీటి పరిధిలో 59 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువులను కొన్నేళ్లుగా గాలికి వదిలేశారు. అయితే చంద్రబాబు హయాంలో నీరు-చెట్టు ద్వారా వాటిని బలోపేతం చేశారు. వీటిని జగన్ హయాంలో తిరిగి అటకెక్కించారు. జిల్లాలో 2.10 లక్షల వ్యవసాయ బోర్లున్నాయి. వీటి ఆధారంగా పెద్ద ఎత్తున పంటలు సాగవుతున్నాయి. అయితే వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. పంటలు సాగు కావడంలేదు. ఈ నేపథ్యంలో రిజర్వాయర్ల నుంచి సమీప చెరువుల్లోకి అనుసంధానం చేసి గ్రావిటీ ద్వారా చెరువులను నింపితే కరువు ఉండదు. చెరువులు నిండాయంటే వాటి పరిధిలోని ఆయకట్టు సాగులోకి వస్తుంది. అలాగే చెరువుల చుట్టూ భూగర్భ జలాలు పెరిగి ఒట్టిపోయిన బోర్లకు నీళ్లు వస్తాయి. బోర్లలో నీరుంటే రైతులు పంటలు సాగు చేస్తారు. ఇలా చేస్తే వేసవిలో నీటి సమస్య ఉండదని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా చెరువులకు నీరందించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. తొలివిడతలో బద్వేలు, కమలాపురం, మైదుకూరు, కడప నియోజకవర్గాల్లోని 65 చెరువులకు నీరందించాలని నిర్ణయించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారులు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారుచేస్తున్నారు.

ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి సామర్థ్యం టీఎంసీలలో..

ప్రాజెక్టు	సామర్థ్యం	ప్రస్తుతం నీరు
గండికోట	26.850	26.020
మైలవరం	6.500	5.876
పైడిపాలెం	6.000	5.315
సర్వారాయ సాగర్	3.060	1.015
వామికొండ	1.658	1.392
తెలుగుగంగ ఎస్‌ఆర్-1	2.130	1.758
ఎస్‌ఆర్-2	2.447	1.957
బ్రహ్మంసాగర్	17.735	7.898
బుగ్గవంక	0.506	0.170
ఎల్‌ఎస్పీ	0.170	0.070



కన్నెలవాగుకు వెళుతున్న నీరు



ఎల్‌ఎస్పీ డ్యాంలో క్రిష్ణాజలాలు

ప్రతి ఎకరాకు నీరందిస్తా..



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి ఎకరాకు నీరందించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. వర్షాల సమయంలో ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయిలో నింపుకుని ఆ నీటిని సమీపంలోని చెరువులకు చేర్చాలన్నది ఉద్దేశ్యం. ఇందులో భాగంగా తొలివిడతలో కడప జిల్లాలో 65 చెరువులను నీటితో నింపేందుకు సిద్ధం చేస్తున్నాం. ఈ మేరకు అంచనాలు రూపొందిస్తున్నాం.

- డి.వెంకటరామయ్య, తెలుగుగంగ ఎస్ఈ

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

కడప మారుతీనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా నవంబర్ 4, 11, 18, 25 తేదీలలో శైవక్షేత్రాలకు (శ్రీశైలం, మహానంది, ఆరుణాచలం) వెళ్లేందుకు అనువుగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. దీంతో పాటు వచ్చే నెల 15న పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలై అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల, మైదుకూరు, డిపోల నుంచి బస్సులు ఏర్పాటుచేశామన్నారు. ఈ అవకాశాన్ని శివభక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సామాన్యులకు న్యాయం జరిగేలా చూడాలి

- అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి డ్రోన్ల వినియోగం
- సమీక్ష సమావేశంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, హాజరైన పోలీసు అధికారులు

కడప క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసుస్టేషన్‌కు వచ్చే సామాన్యుల ఫిర్యాదులకు తక్షణం స్పందించి వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. శనివారం క్యాంపు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, మెడికల్ షాపుల్లో మత్తు కలిగించే మాత్రల అక్రమ విక్రయాలపై నిఘా ఉంచి దాడులు నిర్వహించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ల ద్వారా నిఘా ఉంచి దాడులు ఉధృతం చేయాలన్నారు. సమర్థవంతంగా ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు డ్రోన్లను వినియోగించాలన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్నవారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, ఇతర దుకాణాలు, లాడ్జిలు, హోటళ్లల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలని ఆదేశించారు. కళాశాలల్లో విద్యార్థులకు పోలీసుల విధులు, దర్యాప్తు విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్ బాబు, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ యు.వెంకటకుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, సీఐలు రామక్రిష్ణ, తేజోమూర్తి, వెంకటేశ్వర్లు, సీతారామిరెడ్డి, పురుషోత్తంరాజు, శివశంకర్‌నాయక్ పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలలో నిబంధనలు పాటించాలి

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో టపాసులు ఎక్కడైనా అక్రమంగా విక్రయిస్తున్నా, నిల్వ ఉంచినా డయల్ 100కు లేదా స్థానిక పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా విక్రయించినా వారిపై పేలుడు పదార్థాల చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. సూచించిన బహిరంగ ప్రదేశాల్లో ప్రత్యేక షెడ్లలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నీరు, ఇసుక తదితర అగ్నిమాపక నిరోధక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. చిన్నపిల్లలను బాణసంచా దుకాణాల్లో ఉంచుకోరాదని, లైసెన్సు కలిగిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయాలు చేసుకోవాలని ఆదేశించారు.

ఫోన్‌కాల్ ఎత్తేలోగానే..

హాంఫట్

- అకౌంట్ నుంచి డబ్బులు మాయం
- ఎర్రగుంట్లలో హడలెత్తిస్తున్న సైబర్‌నేరగాళ్ల వ్యవహారం



ఎర్రగుంట్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో బ్యాంకు ఖాతాదారులకు సైబర్‌నేరగాళ్లు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఎప్పుడు ఏ కాల్ వస్తుందో... ఎత్తితే ఖాతానుంచి ఎంత డబ్బులు కట్ అవుతాయోనన్న భయాందోళనకు గురవుతున్నారు. కేవలం ఒక్క ఫోన్ నెంబర్‌నే కాకుండా ఏకంగా వాట్సప్ గ్రూపులను కూడా హ్యాక్ చేస్తున్నారంటే సైబర్ నేరగాళ్లు ఎలాంటి కొత్త టెక్నాలజీ వాడుతున్నారో అర్థమౌతోంది. ముఖ్యంగా ఫోన్ రీచార్జ్ ఆఫర్ పేరు తో చాలా ఫేక్ లింక్‌లు వస్తున్నాయి. క్లిక్ చేస్తే డబ్బులు పోతున్నాయని ఖాతాదారులు వాపోతున్నారు. కొత్త కంపెనీ నుంచి వచ్చే కాల్స్‌ను ఎత్తవద్దని, మెసేజ్ లింక్‌లను ఓపెన్ చేయవద్దని పోలీసు, బ్యాంకు అధికారులు ఖాతాదారులకు సలహా ఇస్తున్నారు.

క్షణాల్లో డబ్బు మాయం

ఎర్రగుంట్ల ప్రకాశ్‌నగర్‌కు చెందిన కొండూరు వెంకట రమణ ఇళ్ల విద్యుత్ మీటర్ బిల్లింగ్ కార్మికుడుగా పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం 11గంటల సమయంలో ఫోన్ రింగ్ అయింది. ఫోన్ ఎత్తి మూడుసార్లు హలో అని అంటుండగానే టింగ్‌మని మెసేజ్ వచ్చింది. రూ.36,000 ఒకసారి, రూ.288 మరోసారి ఆయన అకౌంట్ నుంచి కట్ అయినట్లు చూపించింది. దీంతో షాక్‌కు గురైన వెంకటరమణ తేరుకుని తాను ఎవరికీ డబ్బులు పంపలేదని నిర్ధారించుకుని సంబంధిత ఎస్బీఐ అధికారులను కలిశారు. వారు ఆ మెసేజ్ చూసి సైబర్ నేరగాళ్లపనే అని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయమన్నారు. పోలీసుస్టేషన్‌కు వెళ్లగా కడప సైబర్ పోలీసుస్టేషన్‌కు వెళ్లమని చెప్పడంతో అతను వారిని కలిసి ఫిర్యాదు చేశారు. కాగా.. ఇటీవల బ్యాంకుల నుంచి ఇతర అకౌంట్లకు పంపిన డబ్బులు కూడా సక్రమంగా చేరడంలేదని ఖాతాదారులు వాపోతున్నారు. అలాగే ఫోన్‌పేలో పంపిన డబ్బులు కూడా చాలామంది ఖాతాదారుల ఖాతా నుంచి కట్ అయ్యాయి. కానీ పంపిన వారి అకౌంట్లలో జమ కాలేదు. కనీసం వారంరోజులు అవుతున్నా డబ్బులు ఖాతాల్లోకి వాపస్ రావడంలేదని వాపోతున్నారు.

ఒక్క రూపాయి కూడా రాలేదు

ఆర్టీపీపీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్న చప్పిడి నరేంద్రనాథ్‌రెడ్డి యూనియన్ బ్యాంక్ అకౌంట్ నుంచి జూలై 15వ తేదీ ఉదయం కేవలం గంట వ్యవధిలో రూ.7లక్షలు సైబర్ నేరగాళ్లు మాయం చేసిన సంగతి తెలిసిందే. కడప సైబర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదని ఆయన వాపోయారు. ఐఎంపీఎస్, నెఫ్ట్ ద్వారా కెనారాబ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఫెడరల్‌బ్యాంక్, ఆక్సిస్ బ్యాంకు, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకుకు తన డబ్బు బదిలీ అయినట్లు పేర్కొన్నారు. బెంగళూరు కేంద్రంగా ఉన్న బ్యాంకులకు బదిలీ అయిందన్నారు. పోలీసులు, బ్యాంకు వారు సైబర్ నేరగాళ్ల నుంచి తమ డబ్బులకు రక్షణ కల్పించాలని పలువురు బ్యాంకు ఖాతాదారులు కోరుతున్నారు.

రిమ్స్‌లో నిండు గర్భిణి మృతి

- వైద్యుల నిర్లక్ష్యం అంటూ రోగిబంధువుల ఆందోళన

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని రిమ్స్ ఆసుపత్రిలో కాన్పుకోసం వచ్చిన గర్భిణి మృతిచెందడంతో ఆమె బంధువులు ఆందోళన చేశారు. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం కేసీ తాండాకు చెందిన శివనాయక్ భార్య శ్యామలాభాయి రెండవ కాన్పుకోసం బుధవారం రిమ్స్‌లో చేరింది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కడుపులోని బిడ్డతో సహా చనిపోయింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందింది అంటూ బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి శాంతింపచేశారు. డ్యూటీ డాక్టర్ మాట్లాడుతూ.. కాన్పునకు అనువుగా నొప్పులు రాకపోవడంతో ఎదురుచూశామన్నారు. శుక్రవారం నొప్పులు మొదలు కావడంతో కాన్పు చేసే ప్రయత్నం చేశామన్నారు. అయితే అనుకోకుండా ఫిట్స్ రావం, ఉమ్మనీరు ఎక్కువగా పోవడంతో పల్మనాలజీ సమస్య కారణంగా గుండె పనితీరుకు అంతరాయం ఏర్పడి చనిపోయిందన్నారు. కాన్పు సమయంలో ఇలాంటి సమస్య రావడం సహజమని అయితే శ్యామలాభాయి వైద్యానికి స్పందించకపోవడంతో మరణించిందని తెలిపారు. దీనిపై ఆర్ఎంవో డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. గర్భిణీ మృతిపై నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటుచేసి నిజాలను నిగ్గుతేలుస్తామన్నారు. విచారణలో వైద్యుల నిర్లక్ష్యం అని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ప్రజల రక్షణే లక్ష్యం

- ప్రొద్దుటూరులో మానవ రహిత ట్రాక్
- రవాణాశాఖ యాప్‌లో అన్ని సేవలు
- దళారులను నమ్మద్దు

సీకేదిన్నె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రక్షణ కల్పించడమే ధ్యేయంగా రవాణా శాఖ పనిచేస్తుందని కడప జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కొంతమంది వాహనదారుల అజాగ్రత్తతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇలాంటి వారిపై చర్యలు తప్పవని అన్నారు. రవాణాశాఖ పనితీరు, డ్రైవింగ్ ట్రాక్‌ల గురించి ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: డీటీసీగా మీ లక్ష్యం ఏమిటి?

జవాబు: ఇది రవాణా శాఖ మంత్రి సొంతజిల్లా. దాదాపు నెల రోజుల క్రితం డీటీసీగా బాధ్యతలు చేపట్టాను. ఎంతో నమ్మకంతో ఇక్కడికి తీసుకొచ్చారు. ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చి ప్రజలకు రక్షణ కల్పించేందుకు రవాణా శాఖ ముందుంటుంది. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఫిట్‌నెస్, పర్మిట్ లేని వాహనాలపై..

జవాబు: రోడ్డుమీదకు వచ్చే ప్రతి వాహన చోదకుడు వారి వాహనానికి సంబంధించిన ఫిట్‌నెట్, లైసెన్స్, ఇన్సూరెన్స్ పర్మిట్లు కలిగి ఉండాలి. అలా లేదంటే రవాణా శాఖ తనిఖీల్లో పట్టుబడితే ఆ వాహనాన్ని సీజ్ చేస్తాం.

ప్రశ్న: అతివేగంగా నడిపే ఆకతాయిలపై..

జవాబు: కొందరు వాహనదారులు అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయి. అమాయకులు సైతం ఈ ప్రమాదాల్లో గాయపడటం, మరణించిన సందర్భాలు ఉన్నాయి. స్పీడ్‌గన్ ఉపయోగించి అలాంటివారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. రోడ్డు ప్రమాదాలు తగ్గిస్తాం.

ప్రశ్న: కడపలో డ్రైవింగ్ ట్రాక్ లేదు..

జవాబు: కడపలో డ్రైవింగ్ ట్రాక్ లేక ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. కలెక్టర్‌తో మాట్లాడి స్థలం సేకరించేందుకు కృషి చేస్తాం.

ప్రశ్న: ఆదునిక డ్రైవింగ్ ట్రాక్ నిర్మిస్తారా..

జవాబు: ప్రొద్దుటూరు రవాణా శాఖ కార్యాలయంలో ఆధునిక మానవ రహిత ఏడీటీఆర్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో నైపుణ్యం ఉన్నవారికి మాత్రమే మానవ రహితంగా లైసెన్సు అందుతుంది. దీనివలన నిష్పక్షపాతంగా లైసెన్సులు జారీ అవుతాయి. అదే విధంగా పులివెందుల, బద్వేలులో కూడా ఆధునిక డ్రైవింగ్ ట్రాక్‌లు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రశ్న: దళారుల ప్రభావం అధికం..

జవాబు: రవాణా శాఖ వాహన యాప్ ద్వారా అన్ని సేవలను సులభంగా అందిస్తుంది. దళారులను నమ్మి ప్రజలు మోసపోరాదు. రవాణా శాఖ అధికారులు కార్యాలయ పనివేళల్లో అందుబాటులో ఉంటారు. నేరుగా వచ్చి సంప్రదించవచ్చు.

ఫీజు కట్టలేదని.. భోజనం పెట్టరా..?

- నర్సింగ్ కాలేజీ యాజమాన్యాన్ని ప్రశ్నించిన ఆర్డీవో

జమ్మలమడుగు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఫీజు కట్టలేదని విద్యార్థినులకు భోజనం పెట్టకపోతే ఎలా అని జమ్మలమడుగులోని డాక్టర్ హెలెన్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, సీఎస్ఐ క్యాంబెల్ వైద్యశాల నిర్వాహకులను ఆర్డీఓ సాయిశ్రీ ప్రశ్నించారు. నర్సింగ్ కళాశాలలో విద్యార్థినులు ఫీజులు కట్టలేదని గురువారం రాత్రి నుంచి భోజనం పెట్టలేదనే సమాచారం బయటకు పొక్కింది. వెంటనే కొందరు అక్కడకు వెళ్లి పరిశీలించినట్లు తెలిసింది. శుక్రవారం నర్సింగ్ కళాశాల వద్ద వివిధ సంఘాల నాయకులు, క్యాంబెల్ వైద్యశాల సిబ్బంది, డాక్టర్లు గుమికూడారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రామకృష్ణ అక్కడకు వచ్చారు. ఈ విషయం తెలిసి ఆర్డీఓ సాయిశ్రీ నర్సింగ్ కళాశాల వద్దకు వచ్చి సిబ్బందితో, నర్సింగ్ విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. కళాశాలలో ఉన్న ఇబ్బందులు, సమస్యలను బాధిత విద్యార్థులు వివరించారు. వెంటనే ఆమె యాజమాన్యంతో చర్చించారు. ఫీజు కట్టలేదని అన్నం పెట్టకపోవడం దారుణమన్నారు. ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూడాలని వారిని హెచ్చరించారు. కళాశాలలో ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తేవాలని విద్యార్థినులకు తెలిపారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సమస్యను తమకు చెప్పలేదని, పిల్లలకు అన్నం పెట్టకపోవడం మంచి పద్ధతి కాదని మెడికల్ సూపరింటెండెంట్ అగస్టిన్‌రాజు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ లింగప్ప, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నర్సింగ్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

నా మనుషులకే పని చేయవా..?

- శానిటరీ సెక్రటరీపై దుర్భాషలాడిన చైర్మన్

బద్వేలు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శానిటరీ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీపై శుక్రవారం బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి తిట్లదండకం అందుకున్నారు. నా మనుషులకే పనిచేయవా అంటూ చిందులు వేయడంతో మున్సిపల్ కార్యాలయం వద్ద గందరగోళం ఏర్పడింది. వివరాలిలా.. సుమారు పదేళ్ల కిందట మరణించిన వ్యక్తికి సంబంధించి డెత్ సర్టిఫికెట్ కావాలంటూ మడకలవారిపల్లె సచివాలయంలో వైసీపీ మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి అనుచరుడు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే డెత్ సర్టిఫికెట్ ఇంకా జారీ కాలేదు. దీంతో అనుచరుడు చెప్పిన మాటలు విని చైర్మన్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి మడకలవారిపల్లె సచివాలయం శానిటరీ సెక్రటరీ సుబ్బారెడ్డిని "ఆలస్యం చేస్తున్నావే.. నా మనుషులకే పనిచేయవా.. నీ ఉద్యోగం ఊడపీకేస్తా.. ఏమనుకుంటున్నావు" అంటూ ఆ తిట్లదండకం అందుకున్నారు. డెత్ సర్టిఫికెట్ రెవెన్యూ పరిధిలో ఉంటుందని వీఆర్వో, ఆర్డీఓ కార్యాలయం నుంచే మంజూరు కావాలని, అందుకే ఆలస్యమైందని చెబుతున్నా సచివాలయ ఉద్యోగి చెబుతున్నా ఆయన తిట్లు ఆపలేదు. నా చాంబర్‌లోకి రా అంటూ చైర్మన్ తన చాంబర్‌లోకి వెళ్లారు. అక్కడ కూడా మరోమారు దుర్భాషలాడారు. ఇంతలో మున్సిపల్ కమిషనర్ వాకమల్ల వెంకట నరసింహారెడ్డి అక్కడకు చేరుకుని డెత్ సర్టిఫికెట్ రెవెన్యూ వారి ద్వారా వస్తుందని సర్దిచెప్పడంతో ఆయన శాంతించారు. వైసీపీ అధికారం కోల్పోయినప్పటికీ వైసీపీ ప్రజా ప్రతినిధుల్లో మార్పు రాకపోవడం శోచనీయం అని పలువురు సచివాలయ సిబ్బంది వాపోయారు.



23 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

● ఇద్దరు తమిళ కూలీలు అరెస్ట్



ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లతో అటవీ అధికారులు

సిద్దవటం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న ఇద్దరు తమిళ కూలీలను అదుపులోకి తీసుకుని, 23 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి వివరించారు. శుక్రవారం సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు. కొండూరు బీట్ నీలసరికోన ప్రాంతంలో కొంతమంది ఎర్రచందనం దుంగలు మోస్తూ కనబడడంతో వారిని చుట్టుముట్టి ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, ఎనిమిది మంది పారిపోయారని తెలిపారు. పట్టుబడిన వారిని రంగస్వామి, భూపాలన్‌గా గుర్తించామన్నారు. పారిపోయిన వారిలో ఒకరు ఉమ్మడి కడప జిల్లా చాపాడు మండలానికి చెందిన జాకీర్ అని విచారణలో తేలిందన్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం 569 కిలోలుండగా, రూ.1,58,035 విలువ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఎర్రచందనాన్ని అటవీశాఖ కార్యాలయానికి తరలించి, నిందితులను తిరుపతి కోర్టులో హాజరు పరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ సురేష్, ఎఫ్‌బీవోలు విశ్వనాథ్‌రెడ్డి, దీపిక, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

6 నుంచి రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



భూమి పూజ చేసి ప్రారంభిస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ములకల చెరువులో 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 విభాగం బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నవంబరు 6, 7 తేదీల్లో జరగనున్నాయి. ఈ పోటీలకు బాలురు, బాలికల విభాగంలో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. ఈ పోటీలకు గానూ ములకల చెరువులోని ఇండేన్ గ్యాస్ గోడౌన్ సమీపంలో ఉన్న మైదానాన్ని ఎంపిక చేశారు. ఈ క్రమంలో శుక్రవారం మైదానాన్ని రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం చేసేందుకు చదును చేసే పనుల ప్రారంభం కోసం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి, మదనపల్లె డీవైఈవో పురుషోత్తం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వసంత భూమి పూజ చేశారు. బాలురు, బాలికల విభాగంలో మొదటి, రెండవ స్థానంలో నిలిచిన జిల్లా జట్లకు రూ.3లక్షలు నగదు ప్రోత్సాహకం అందిస్తానని జయచంద్రారెడ్డి ప్రకటించారు. అలాగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, పీడీలు, పీఈటీల అభ్యర్థన మేరకు పోటీల్లో పాల్గొనే ఉమ్మడి 13 జిల్లాల క్రీడాకారులకు, సిబ్బందికి భోజన, వసతి, మెమొంటోలు, స్టేజి ఏర్పాటు, మైదానం చదునుకు అయ్యే ఖర్చు భరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటరమణ, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం క్రిష్టారెడ్డితో పాటు నియోజకవర్గంలోని ఆరు మండలాల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

నందలూరు, అక్టోబరు 25: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా ఎస్‌జీ ఎఫ్ క్యారమ్స్ అండర్-14, 17 విభాగాల్లో నంద లూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తేజకృష్ణ, పెంచలయ్య, నరసింహ, స్వర్ణలత, వెంకట స్నేహ, మల్లికార్జున, మాలశ్రీ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు షేక్ రౌఫ్‌బాషా తెలిపారు. ఇటీవల బయనపల్లి, చింత కొమ్మదిన్నెలో జరిగిన అండర్-14 ఖోఖో పోటీల్లో ఉమ్మడి కడపజిల్లా స్థాయిలో మొదటిస్థానంలో నిలిచిన 7వ తరగతి విద్యార్థి నాగచైతన్య కూడా రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని తెలిపారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య

రైల్వేకోడూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు మండలంలోని కే.బుడుగుంటపల్లె దళితవాడకు చెందిన వెంకటేష్ (24) తరచూ కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. శుక్రవారం ఉదయం విపరీతంగా కడుపునొప్పి రావడంతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్కూటరిస్టుకు తీవ్ర గాయాలు

రాజంపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై హైవేరోడ్డులోని ఊటుకూరు మలుపు వద్ద శుక్రవారం ఆగి ఉన్న స్కూటర్‌ను లారీ ఢీకొనడంతో పాటు స్కూటర్‌పై ఉన్న విక్రమ్ ఎడమ కాలుపైనుంచి వెళ్లింది. దీంతో అతని ఎడమకాలు శరీరం నుంచి విడిపోయింది. వెంటనే రాజంపేట ప్రభుత్వానుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

సిరులు కురిపిస్తున్న బొప్పాయి పీలింగ్

బొప్పాయి పీలింగ్ రైతులకు సిరులు కురిపిస్తోంది. బొప్పాయి కాయల దబ్బలే టన్ను సుమారు రూ.5 వేలు ధర పలుకుతుండడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాల్లోని ఫ్యాక్టరీలకు కూడా సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా రైల్వేకోడూరు, ఓబులవారి పల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల నుంచి వారానికి 20 లారీల్లో ఇతర రాష్ట్రాల్లో ఉన్న నగరాలకు ఎగుమతి చేయడంతో పాటు.. స్థానికులకు జీవనోపాధి కల్పిస్తున్నారు.

టన్ను రూ.5 వేలు ● ఇతర రాష్ట్రాలకు సరఫరా ● పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వ్యాపారుల డిమాండ్

రైల్వేకోడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి కాపు వచ్చిన తర్వాత ముందస్తుగా రైతుల నుంచి పీలింగ్ చేసే యజమానులు రైతుల దగ్గర నుంచి కాయలను కొనుగోలు చేసుకుంటారు. తోటలో రెండు నుంచి మూడుసార్లు కోతలు జరిగిన తర్వాత మధ్యస్తంగా ఉన్న కాయలను పీలింగ్ వ్యాపారులకు రైతులు విక్రయిస్తారు. రైతుల నుంచి కొన్న కాయలను పీలింగ్ కేంద్రాల్లోకి తెచ్చి యంత్రాలతో పైతాట తీసి కట్ చేస్తారు. కట్‌చేసిన కాయల దబ్బలను రెండు నుంచి మూడు రోజుల పాటు పెద్ద, పెద్ద తొట్లలో ఉప్పులో నానబెడతారు. ఆ నానబెట్టిన దబ్బలను లారీల్లో కర్ణాటక, తమిళనాడు, కోల్‌కతా, కేరళ, మహారాష్ట్ర నగరాలలో ఉన్న పరిశ్రమలకు తరలిస్తారు. టూటీఫ్రూటీ పరిశ్రమల్లో బొప్పాయి దబ్బలను చిన్న, చిన్న ముక్కలుగా తయారు చేసి వాటిని వివిధ రంగుల్లో ముక్కలను తయారు చేస్తారు. ముక్కల్లో స్వీట్ కలుపుతారు. దాని ద్వారా కమ్మని చెర్రీస్‌గా తయారు చేస్తారు. వీటిని బ్రెడ్డు, ఐస్‌క్రీములు తదితర వాటిల్లో ప్రధానంగా ఉపయోగిస్తారు. ఇవి ఎక్కువగా రుచిగా ఉండడంతో డిమాండ్ బాగా ఉంటుంది.

ఉప్పులో నానబెట్టిన కాయ దబ్బలు టన్ను సుమారు రూ.5 వేలు ధర పలుకుతోంది. కోడూరు నుంచి ఉప్పులో నానబెట్టిన దబ్బలను రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల నుంచి వారానికి 20 లారీల్లో ఇతర రాష్ట్రాల్లో ఉన్న నగరాలకు ఎగుమతి చేస్తారు. అంటే సుమారు 100 టన్నులు బొప్పాయి దబ్బలు ఎగుమతి అవుతున్నాయని వ్యాపారులు, రైతులు చెబుతున్నారు. కోడూరు పట్టణంలో సుమారు 10 చిన్నతరహా పరిశ్రమలున్నాయి. ఇవి కూడా పెద్ద సాంకేతిక పరిజ్ఞానం కల్గినవి కాదని వ్యాపారులు అంటున్నారు. ఒకే యంత్రంపై ఆధారపడి కాయల పైన ఉన్న తాటను తీసి వేసేంత వరకే ఉపయోగపడుతున్నాయి. సాంకేతికపరంగా పెద్ద, పెద్ద యంత్రాలు ఉంటే గంట పని.. పది నిమిషాలకు అయిపోతుంది. రైల్వేకోడూరు, ఓబులవారి పల్లె, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు తదితర ప్రాంతాల్లో తోటల్లో కోతలు అయిపోయే స్థితిలో పీలింగ్‌కు రైతులు అమ్ముకుంటారు. ప్రతి ఏటా కొన్ని వేల టన్నుల కాయలను రైతుల దగ్గర నుంచి కాయలను పీలింగ్ యజమానులు తీసుకుంటారు.



బొప్పాయి కాయలను యంత్రంలో వేసి తాట తీస్తున్న దృశ్యం

వెయ్యి మందికి పైగా ఉపాధి

బొప్పాయి పీలింగ్ ద్వారా సుమారు 1000 మంది కూలీలు జీవనోపాధి పొందుతున్నారు. కోడూరు మండలంలో సుమారు 25 సంవత్సరాల నుంచి చిన్న పరిశ్రమలు మైసూరివారిపల్లె, జంగిటివారిపల్లె, కోడూరు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారులకు లాభసాటిగా మారింది. చాలామంది యువకులు ఈ పరిశ్రమలు పెట్టుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. చిన్న పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహించి రుణాలను మంజూరు చేస్తే బొప్పాయి పీలింగ్ పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

అధునాతన యంత్రాలు కావాలి

– ప్రసాద్, జంగిటివారిపల్లె, వ్యాపారి



అధునాతన సాంకేతిక బొప్పాయి పీలింగ్ యంత్రాలు కావాలి. ప్రస్తుతం ఉన్న యంత్రాలతోనే పీలింగ్ చేస్తున్నాము. ఉప్పులో నానబెట్టిన దబ్బలను ఇతర రాష్ట్రాల్లో ఉన్న నగరాలకు ఎగుమతి చేస్తున్నాము. టన్ను రూ.5 వేలు పలుకుతోంది. టూటీఫ్రూటీ పరిశ్రమలు రైల్వేకోడూరులో పెడితే ఖర్చు పూర్తి స్థాయిలో తగ్గిపోతాయి.

పరిశ్రమలను స్థాపించాలి

– బ్రహ్మయ్య, రైల్వేకోడూరు, బొప్పాయి రైతు



రైల్వేకోడూరులో చిన్న తరహా పరిశ్రమలను స్థాపించాలి. దీంతో చాలా మందికి జీవనోపాధి కలుగుతుంది. రైతులు బొప్పాయి సాగు చేపట్టి దిగుబడులు వచ్చిన తర్వాత కాయలను రెండు నుంచి మూడుసార్లు కోతలు జరిగిన తర్వాత మధ్యస్తంగా ఉన్న కాయలను పీలింగ్ వ్యాపారులకు విక్రయిస్తారు.



పీలింగ్ కేంద్రానికి తరలించిన బొప్పాయి కాయలు



పెద్ద తొట్టిలో ఉప్పులో నానబెట్టిన బొప్పాయి దబ్బలు



బొప్పాయితో తయారు చేసిన చెర్రీస్

'గజగజ' వణుకుతున్న పీలేరు!

పీలేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఏనుగుల సంచార సమాచారంతో పీలేరు శుక్రవారం గజగజ వణికిపోయింది. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు, రామిరెడ్డిగారిపల్లె ప్రాంతాల్లో తిష్టవేసిన ఏనుగులు మళ్లీ పీలేరు వైపు వస్తున్నాయని సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఆ గ్రామాలకు పొరుగున్న పీలేరు మండలం ఎర్రగుంటపల్లె, అగ్రహారం పంచాయతీ ప్రజలు భయంతో వణికిపోయారు. ఈ నెల 15న ఏనుగుల దాడిలో పీలేరు మండలం కాకులారంపల్లెకు చెందిన రైతు చిన్న రాజారెడ్డి చనిపోయిన విషయం తెలిసిందే. అప్పటి వరకు ఏనుగుల ఊసు తెలియని పీలేరు మండల ప్రజలకు వాటి భయం పట్టుకుంది. 15వ తేదీన రాత్రి ఏనుగులను పీలేరు ప్రాంతం నుంచి కల్లూరు ఘాటులోకి అటవీ అధికారులు విజయవంతంగా తరిమేయడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం ఆ ఏనుగుల గుంపు పులిచెర్ల వైపు రావడం, అక్కడి రైతులు, అటవీ శాఖాధికారులు వాటిని మళ్లీ అటవీ ప్రాంతంలోకి తరిమే క్రమంలో అవి దారి తప్పి పీలేరు వైపు రావడం జరిగింది. ఈ విషయాలను సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పీలేరు ప్రజలు హడలెత్తిపోయారు. అవి మళ్లీ తమ ప్రాంతాల్లోకి ఎక్కడ వచ్చేస్తేయోనని పులిచెర్ల మండల సరిహద్దు గ్రామాలైన అగ్రహారం పంచాయతీ రామిరెడ్డిగారిపల్లె, ఎనుములవారిపల్లె భయంతో గడిపారు. అయితే ఏనుగుల సంచారం గురించి తెలుసుకున్న పీలేరు, మదనపల్లె బీట్ అటవీ సిబ్బంది గురువారం రాత్రి నుంచి అవి పీలేరు వైపు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చుతూ రాత్రంతా పులిచెర్ల-పీలేరు సరిహద్దు గ్రామాల్లో గడిపారు. దీంతో శుక్రవారం అవి పీలేరు మండలంలో ప్రవేశించలేకపోయాయి. ఒకసారి వచ్చినవి మళ్లీ మళ్లీ వస్తాయన్న భయంతో ఏనుగుల సంచారంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హత్య కేసు కొట్టివేత

రాయచోటిటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కేసును రుజువు చేయడంలో పోలీసులు విఫలమయ్యారంటూ రాయచోటి 5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి శుక్రవారం ఓ హత్య కేసును కొట్టివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ పెద్దగొల్లపల్లెకు చెందిన బుట్టిమాని తిమ్మయ్య, రెడ్డిచర్ల రామకృష్ణ, బుట్టిమాని చిన్నప్ప సోదరుడైన తిమ్మయ్య ముగ్గురూ ప్రాణస్నేహితులు. వీరు ముగ్గురూ కలిసి మెలిసి తిరిగేవారు. ఈ క్రమంలో చిన్నప్ప సోదరుడైన తిమ్మయ్యకు అదే గ్రామానికి చెందిన ఎర్రయ్యకు 2019 నవంబరులో భూతగాదాలు ఏర్పడ్డాయి. ఈ విషయంలో ఎర్రగొల్లి ఎర్రయ్యకు మద్దతు తెలిపాడన్న కారణంతో బుట్టిమాని తిమ్మయ్య, రెడ్డిచర్ల రామకృష్ణ కలిసి 2019, నవంబరు 7న చిన్నప్ప సోదరుడు తిమ్మయ్యను హత్య చేశారని సుండుపల్లె పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును రుజువు చేయడంలో పోలీసులు విఫలమయ్యా రని రాయచోటి 5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి కేసును కొట్టివేస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితుల తరఫున న్యాయవాది టి.ఈశ్వర్‌రెడ్డి, పి.రెడ్డయ్యలు వాదించారు.

మరమ్మతు పనులతో...

బిరాబిరా కదులుతున్న పింఛా జలాలు



సప్లై ఛానెల్‌లో పనులు చేస్తున్న కూలీలు

పీలేరు, అక్టోబరు 25: ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సప్లై ఛానెల్‌కు అధికారులు, టీడీపీ నాయకులు చేపట్టిన మరమ్మతు పనులు సత్ఫలితాలు అందిస్తున్నాయి. మరమ్మతుల కారణంగా అడ్డంకులు తొలగడంతో పింఛా జలాలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకువైపు బిరాబిరా కదులుతున్నాయి. సమ్మర్ స్టోరేజ్ కంటే ముందు ఉన్న కాకులారంపల్లె పంచాయతీ ఎర్రదొడ్డిపల్లె చెరువులోకి గురువారం సాయంత్రం పింఛా జలాలు చేరుకోవడంతో అటు పీలేరు వాసులు, ఇటు కాకులారంపల్లె పంచాయతీ వాసుల్లో ఆశలు చిగురించాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు పింఛా నది నుంచి సప్లై ఛానెల్ ఉన్నప్పటికీ కాంక్రీటు కట్టడం కాకపోవడంతో కాలక్రమంలో అది బలహీన పడింది. దీంతో నీటి ప్రవాహంపై అనుమానాలు ఏర్పడ్డాయి. ఈ విషయం కాకులారంపల్లె నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే సప్లై ఛానెల్‌కు మరమ్మతులు యుద్ధప్రాతి పదికన చేపట్టాలని సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు యల్లెల రెడ్డప్పరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాలతో ఆయన వ్యక్తిగత కార్యదర్శి సత్య, అధికారులు, నాయకులతో సమన్వయం చేసుకుని ఈ నెల 22న మరమ్మతులు ప్రారంభించారు. పింఛా నది నుంచి నీటిని సప్లై ఛానెల్‌కు అనుసంధానం చేసే స్థలం నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వరకు మరమ్మతులు పనులు పూర్తి చేశారు. దీంతో ఛానెల్‌లో నీటి ప్రవాహం ఆరంభమైంది. అయితే విపరీతంగా పెరిగిపోయిన జమ్ము, పొదలు, చెట్ల కొమ్మలు ప్రవాహానికి అడ్డుపడుతుండడంతో శుక్రవారం ఉదయం కూలీలను రంగంలోకి దింపి వాటిని తొలగించే పనులు చేపట్టారు. దీంతో ఛానెల్‌లో ప్రవాహ వేగం పెరిగింది. ప్రస్తుతం పింఛా జలాలతో ఎర్రదొడ్డిపల్లె చెరువు పాక్షికంగా నిండింది. మరో రెండు రోజుల్లో అది నిండిపోతుందని, ఆ తరువాత సమ్మర్ స్టోరేజ్‌కు జలాలు పరుగులు పెడతాయని యల్లెల రెడ్డప్పరెడ్డి తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఒకసారి నిండితే మూడేళ్ల పాటు పీలేరు పట్టణంతో పాటు కాకులారంపల్లె ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఆయన తెలిపారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి!

● స్టేట్ కో-ఆర్డినేటర్ అక్బర్ అలీ

గాలివీడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ స్టేట్ కో-ఆర్డినేటర్ అక్బర్ అలీ విజ్ఞప్తి చేశారు. గాలివీడు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ నిర్వహణపై శుక్రవారం ఆయన సమీక్షించారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 10వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రెండు వేల అడ్మిషన్లు పూర్తయ్యాయని, ఈ సంఖ్య మరింత పెంచేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస రాజు మాట్లాడుతూ రూ.200ల అపరాధ రుసుముతో ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు, రూ.500ల అపరాధ రుసుముతో ఈ నెల 30, 31 తేదీలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అర్హులైన వారిని చైతన్యవంతుల్ని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గాలివీడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దుర్గేశ్వర రాజు, మొహిద్దిన్ బాషా, కో-ఆర్డినేటర్ నాగరాజు, మహేశ్వరయ్య, మధుమతి, శివానంద్, శివారెడ్డి, రమణయ్య, వెంకటయ్య, నిర్మలా దేవి, ఫైరోజ్, షబానా, సుబ్బారాయుడు, మధుమతి, శివానాయక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి గురైన విగ్రహాలు రికవరీ - ఇరువురి అరెస్టు

రాజంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చోరీకి గురైన విగ్రహాలు రికవరీ చేసి, నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ సుధాకర్ తెలిపారు. శుక్రవారం మన్నూరు పోలీసు స్టేషన్‌లో సీఐ రామాంజనేయులుతో కలసి ఆయన వివరాలు వెల్లడించారు. రాజంపేట మండలం పోలిచెరువు కట్టపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలోని ఆంజనేయ, లక్ష్మీదేవి, వినాయక విగ్రహాలు ఈనెల 17న చోరీ అయ్యాయన్నారు. ఈ కేసులో దర్యాప్తు చేసిన పోలీసులు సయ్యద్ మస్తాన్‌బాషా, షేక్ మస్తాన్ కలీంను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక అడుగు ఎత్తు గల ఇత్తడి పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం, అర్థడుగు లక్ష్మీదేవి విగ్రహం, అర్థడుగు ఇత్తడి వినాయక విగ్రహాలతోపాటు, రూ 8 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

చెక్కు చెదరని అపూర్వ కట్టడం

● 200 ఏళ్ల క్రితం నాటి నిర్మాణం

● కడపకు తలమానికంగా పాత కలెక్టరేట్

● మ్యూజియంగా మారిస్తే భవిష్యత్ తరాలకు ఉపయోగం



కడప కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చెక్కు చెదరని అపూర్వ కట్టడంగా కడప నగర నడిబొడ్డున గల పాత కలెక్టరేట్ నేటికీ దర్శనమిస్తోంది. నాటి బ్రిటీష్ తెల్లదొరల హయాంలో గత 1808 సంవత్సర కాలంలో ఈ భవన నిర్మాణం చేసినట్లు తెలుస్తోంది. 200 ఏళ్ల నాటి నిర్మాణం కావడంతో కడపకు తలమానికంగా చెప్పవచ్చు.

నగర ఏడురోడ్ల కూడలికి దగ్గరగా నిర్మించిన పాత కలెక్టరేట్ పూర్తిగా రాయి, గచ్చు, ఇటుక, ఉక్కు, రంగూన్ టేకుతో అప్పట్లో చాలా కట్టుదిట్టంగా నిర్మించడంతో ఇప్పటికీ ఆ భవనం హుందాతనంతో కళాత్మకంగా చూపరులను ఆకట్టుకుంటోంది. భవనానికి ప్రధాన ద్వారం ఉత్తర దిక్కున ఏర్పాటు గావించారు. కింద నుంచి పై అంతస్తుకు వెళ్లేందుకు వీలుగా నాలుగు దిక్కుల గుండా మెట్ల మార్గాలున్నాయి. ఒక్కో మెట్ల మార్గంలో ఏడు మలుపులతో వుంటూ ఆ లెక్కన ప్రతీ మలుపులో ఐదేసి మెట్లు వున్నాయి. పూర్తిగా భవనం పైభాగానికి వెళ్లాలంటే ఆగ్నేయం మూలలో గల మెట్ల మార్గం గుండా వెళ్లాలి. స్వాతంత్ర్యానికి పూర్వం కడప మొట్టమొదటి కలెక్టర్‌గా సర్ థామస్ మన్రో, ద్వితీయ కలెక్టర్‌గా డబ్ల్యూ డబ్ల్యూ చాప్లిన్, తృతీయ కలెక్టర్‌గా జి.గ్రెగరి సేవలందించారు. కాగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత (1947) మొట్టమొదటి కలెక్టర్‌గా ఆర్.ఎస్.మలయప్పన్, ద్వితీయ కలెక్టర్‌గా డబ్ల్యూ.హెచ్. మిచ్చెల్, తృతీయ కలెక్టర్‌గా టి.ప్రభాకరరావు నాయుడు సేవలందించారు.

ఇదిలా వుండగా భవనానికి పడమర వైపు పోర్టికో, ఉత్తరం వైపున ట్రెజరీ గార్డ్స్ వుండేవి. ఇందులో కోనేరు రంగారావు కమిటీ (కెఆర్‌ఆర్) డిప్యూటీ కలెక్టర్ చాంబర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ క్యాంప్ క్లర్క్ గది, అలాగే రెండవ జాయింట్ కలెక్టర్ చాంబర్, కలెక్టర్ క్యాంప్ క్లర్క్ గది, కలెక్టర్ చాంబర్, జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్‌లు కూడా వుండేవి. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్ స్టేట్ వైడ్ నెట్‌వర్క్ (ఏపీ స్వాన్ గది) కాగా అందులో వున్న ఓ పెద్ద గదిలో ఎ-సెక్షన్, బి-సెక్షన్, సి-సెక్షన్, డి-సెక్షన్, ఇ-సెక్షన్, ఎఫ్- సెక్షన్, జి-సెక్షన్, డిస్పాచింగ్ విభాగాలు, సోషల్ వెల్ఫేర్ ల్యాండ్ ఆక్విజిషన్ (ఎస్.డబ్ల్యూ.ఎల్.ఎ) సిబ్బంది వుండేవారు. హాలుకు ఉత్తరం వైపు గ్రంథాలయం వుండేది. కాలగమనంలో 2008 ఆగస్టు 11 నుంచి గ్రంథాలయం స్థానంలో మినీ కాన్ఫరెన్స్ హాలు ఏర్పాటైంది. వీటితో పాటుగా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ చాంబర్ వుండేది. జిల్లా ట్రెజరీ కార్యాలయాన్ని ట్రెజరీ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంగా ఒకప్పుడు పిలిచేవారు. లోపలి వైపు స్ట్రాంగ్ రూమ్ వుండేది. ఏదేమైనా కడపకు తలమానికంగా నిలిచిన పాత కలెక్టరేట్ 2016 ఏప్రిల్ వరకూ ప్రజలకు సేవలందించింది.

మ్యూజియంగా మారిస్తే బాగుంటుంది

నగర ఆర్ట్స్ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన కొత్త కలెక్టరేట్ భవన సముదాయం నుంచి ప్రజాసేవలు ప్రారంభమైనప్పటి నుంచి పాత కలెక్టరేట్ భవనం కళావిహీనంగా దర్శనమిస్తోంది. భవనం చుట్టూ పరిసరాలు చెత్తా, చెదారం, మట్టితో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. పాలకులు, జిల్లా అధికారులు కాసింత దూర దృష్టి సారించి ఆ భవనాన్ని మ్యూజియంగా మారిస్తే భవిష్యత్ తరాలకు గొప్ప ప్రాచీన సంపద అందించినట్లు అవుతుందని పలువురు జిల్లావాసులు కోరుతున్నారు.

వలపు వల.. చిక్కారో విలవిల

- వీడియో కాల్‌లో అందమైన స్త్రీలు మాట్లాడతారు
- ముఖం కనబడితే చాలు.. మార్ఫింగ్ చేస్తారు
- నగ్న వీడియోలు పంపి బ్లాక్‌మెయిల్ చేస్తారు
- డబ్బులు పంపకపోతే.. బెదిరింపులకు దిగుతారు
- వలపు వలలో చిక్కుకుంటున్న బాధితులు
- లక్షల్లో డబ్బులు సమర్పించుకుంటున్న వైనం



కడప క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మోసపోయేవారున్నంత వరకూ మోసం చేసేవారు తయారవుతూనే ఉంటారు. ఇప్పుడు సైబర్ మోసాలు ఎక్కువ అవుతున్నాయి. నేరగాళ్లు ఇతరులను టార్గెట్ చేసుకుంటూ వారి జేబులు నింపుకుంటున్నారు. ఒకరి ఆశ, ఇంకొందరి ఆత్యాశను క్యాష్ చేసుకోవడానికి వలపు వల విసురుతున్నారు. చదువు రానోళ్లే కాదు.. వీరి ఉచ్చులో విద్యార్థులు, ఉన్నత విద్య చదివినోళ్లు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు.

కొత్త నెంబర్ల నుంచి వీడియోకాల్ చేస్తారు. అనుకోకుండా ఏదైనా ముఖ్యమైన కాల్ ఏమో అని ఎత్తామా ఇక అంతే సంగతులు. అవతల అందమైన స్త్రీ నగ్నంగా ఉండి మాట్లాడుతుంది. ఆ కాల్ ఎత్తి మన ముఖం చూపిస్తే చాలు.. అటువైపు ఆమె, ఇటు పక్క బాధితుడు స్ర్కీన్ మీద కనిపిస్తున్న వీడియోను రికార్డు చేస్తారు. ఆ కాల్ కట్ చేసి మన ఫేస్‌ను మార్ఫింగ్ చేసి అశ్లీల పద్ధతిలో వీడియోలు తయారు చేసి మనకే పంపిస్తారు. ఇక బెదిరింపులు మొదలుపెడతారు. నగ్న వీడియోను కుటుంబ సభ్యులకు పంపుతామని, తెలిసిన వారుంటే ఆయా గ్రూపుల్లో షేర్ చేస్తామని బెదిరిస్తారు. తరువాత మనకు కాల్ చేసి డబ్బు ఇవ్వకుంటే ఆ వీడియోలు నీ గ్రూపుతో పాటు ఇతర సోషల్ మీడియాలో మీకు కాంటాక్ట్ ఉన్న ప్రతి ఒక్కరికీ పంపిస్తామంటూ బ్లాక్‌మెయిల్‌కు దిగుతారు. దీంతో బాధితులు బయటికి చెప్పుకోలేక తమ పరిస్థితి ఇతరులకు చెబితే చిన్నచూపు చూస్తారేమోననే ఉద్దేశ్యంతో వారు అడిగిన డబ్బులు ఇస్తున్నారు. ఇలా సైబర్ నేరగాళ్లు రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. పోలీసులు ఒక పక్క అవగాహన కల్పిస్తున్నా.. కొత్త కొత్త విధానాలతో సైబర్ కేటుగాళ్లు తెగబడుతు న్నారు. జిల్లాలో ఇలాంటి సైబర్ నేరాలు చోటు చేసుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది.

కడప జిల్లాకు చెందిన విశ్రాంత అధికారి వీరి ఉచ్చులో పడి దాదా పు రూ.8లక్షలు పోగొట్టుకున్నారు. ఓ పెద్ద ఉద్యోగి కూడా దాదాపు రూ.6లక్షల వరకు పోగొట్టుకున్నట్లు సమాచారం. దాదాపు 15 మంది వరకు సైబర్ నేరగాళ్ల వలలో పడి లక్షల్లో పోగొట్టుకుని చివరికి పోలీసులను ఆశ్రయించారు.

వాట్సప్‌లో కొత్త నెంబర్ల వీడియో కాల్స్ ఎత్తకండి



మీ కాంటాక్ట్‌లో లేకుండా ఉండి, గుర్తు తెలియని నెంబరు నుంచి వాట్సప్ వీడియో కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దు. ఒకవేళ ఎత్తాల్సి వస్తే మొబైల్‌లో ఫ్రంట్ కెమెరాను వేలితో మూసి లిఫ్ట్ చేయాలి. దీంతో మనం స్ర్కీన్‌లో కనిపించం. దీంతో అవతల వాళ్లు రికార్డు చేసే అవకాశం ఉండదు. ఎవరైనా మోసపోతే గంట వ్యవధిలో 1930కి కాల్ చేసి వివరాలు తెలపాలి. అపరిచిత కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి.

-మధుమల్లేశ్వర్‌రెడ్డి,
సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్, కడప

లింకులు క్లిక్ చేస్తే ఊడ్చేస్తారు

ఉచిత డేటా, ఐఫోన్ అంటూ ఊరించే సందేశాలు ఇప్పుడు సర్వసాధారణ మయ్యాయి. ఏ మాత్రం ఆశ పడి క్లిక్ చేసినా బ్యాంకుల్లో దాచుకున్న సొమ్మంతా ఊడ్చేస్తారు. ఇక్కడ ఎవరూ ఏది ఉచితంగా ఇవ్వరనే విషయాన్ని గ్రహించాలి. ప్రజల మానసిక బలహీనతలతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. లక్షకు పైగా సంపాదించవచ్చు, రోజుల వ్యవధిలో పెట్టుబడి రెట్టింపు అవుతుంది లాంటి ప్రకటనలు ఊరిస్తున్నాయని, వీటిని నమ్మి మోసపోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

దోమల నియంత్రణకు పాటుపడాలి

- జిల్లా మలేరియా అధికారి మనోరమ



వాటర్ డ్రమ్ములను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారిణి మనోరమ

కడప కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించి దోమల నియంత్రణకు పాటుపడాలని జిల్లా మలేరియా అధికారిణి మనోరమ అన్నారు. శుక్రవారం నగరంలోని అగాడి వీధిలో డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె వీధిలోని పలు ప్రాంతాలను పరిశీలించి స్థానికులకు తగు సూచనలు చేశారు. వారానికి ఒక సారైన ఇళ్లలోని తొట్లు, బానలు, కుండలను శుభ్రం చేసి ఆరబెట్టాలన్నారు. కాచీ చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ జ్వరాల నుంచి తప్పించుకోవాలంటే పరిశుభ్రతతో పాటు దోమల నియంత్రణకు రాత్రి నిద్రించు సమయంలో దోమలు కుట్టకుండా తప్పకుండా దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసరు డాక్టర్ శ్రావణి, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సీహెచ్‌ఓ చిన్న పుల్లయ్య, సబ్‌యూనిట్ ఆఫీసరు నాగలక్ష్మిరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

జిల్లాలో పక్కాగా పశుగణన ప్రారంభం



పశుగణనను ప్రారభిస్తున్న ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి

కడప కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి జాతీయ పశుగణన ప్రారంభమైంది. ముందుగా జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ అదితి సింగ్, కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డిల నివాసాలకు జిల్లా పశు వైద్యాధికారిణి శారదమ్మ తన సర్వే సిబ్బందితో కలసి వెళ్లి 21వ పశుగణన సర్వేను ప్రారంభించారు. పశుగణన సర్వే ప్రక్రి యలో భాగంగా జిల్లా పశు వైద్యాధికారులు, పశుగణన కోసం నియమించిన శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందితో ఈనెల 25వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు పశుగణన నిర్వహించనున్నారు. జిల్లాలో 2019లో జరిగిన గణన ప్రకారం జిల్లాలో ఆవులు, ఎద్దులు 44,656, గేదేలు 3,99,910, గొర్రెలు 9,83,684 మేకలు 3,62,582, పందులు 2,777, కోళ్లు 1,95,152 ఉన్నాయి. ప్రస్తుతం చేపట్టిన పశుగణాంకాలతో ఈ లెక్కలు పక్కాగా తేలనున్నాయి. అంతేకాకుండా గుర్రాలు, ఒంటెలు కలుపుకొని 16 రకాల పశుసంపదను ఈ గణనలో సర్వే సిబ్బంది లెక్కలు కట్టి యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్‌రెడ్డి, డీడీ డాక్టర్ రంగస్వామి, ఏడీ డాక్టర్ శ్రీధర్, లింగారెడ్డి, ఎన్యుమరేటర్స్ మాహన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

గండికోటకు 12వేల క్యూసెక్కుల కృష్ణాజలాలు

కొండాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వా యిర్ నుంచి జీఎన్ఎస్ఎస్ వరద కాల్వ ద్వారా గండికోట ప్రాజెక్టుకు 12 వేల క్యూసెక్కులు కృష్ణాజలాలు వస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఇప్పటికే 6వేలు వస్తుం డగా మరో 6 వేలు శుక్రవారం నుంచి వస్తున్నాయన్నారు. దీంతో మైలవరం జలాశయానికి శుక్రవారం రాత్రి 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తునట్లు తెలిపారు. అదే విధంగా మెయిన్ కెనాల్‌కు 75 క్యూసెక్కుల నీటిని వదులు తున్నామన్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థి ప్రతిభ



ప్రతిభచూపిన విద్యార్థి సువర్ణను అభినందిస్తున్న డైరెక్టర్ గుప్త

వేంపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ప్రథమ సంవత్సరం చదువుతున్న సువర్ణ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఈనెల 14 నుంచి 18 వరకు గోవాలో జరిగిన 33వ నేషనల్ బెంచ్ ప్రెస్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సువర్ణ కాంస్యపతకం సాధించింది. డైరెక్టర్ కుమారస్వామి గుప్త శుక్రవారం ఆ విద్యార్థినిని అభినందించారు. కోచ్ తివారి శిక్షణలో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు ఓబయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా కట్టడికి చర్యలు

- ట్రాన్స్‌పోర్ట్, కొరియర్ గోడౌన్‌ల తనిఖీలు



గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న డీఎన్‌సీసీ అధికారులు

కడప (క్రైం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గంజాయి నిర్మూలనకు ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సెల్ (డీఎన్‌సీసీ)ఆధ్వర్యంలో శనివారం కడప జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో గంజాయిని కట్టడి చేసే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ట్రాన్స్‌పోర్ట్, కొరియర్ కార్యాలయాలు, గోడౌన్‌లలో తనిఖీలు నిర్వహించారు. గంజాయి విక్రయాలపై ప్రజలు సహకరించి సమాచారం అందించాలని డీఎన్‌సీసీ అధికారులు కోరారు.

మెడికల్ స్టోర్లను తనిఖీ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు



మెడికల్ స్టోర్లలో రికార్డులు పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి

కడప కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మత్తు మందులతో యువత చిత్తు అవుతోందని ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనాలకు స్పందించిన డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగకిరణ్ ఆధ్వర్యంలో కడప డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి, రాయచోటి ఇన్‌స్పెక్టర్ జయరాముడులు శుక్రవారం నగరంలోని పలు మెడికల్ షాపులను అకస్మికంగా తనిఖీలు చేశారు. మత్తు కల్గించే మందుల అమ్మకాలకు సంబంధించిన రికార్డులను వారు పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన రెండు షాపులపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. ఈ తనిఖీలో పోలీసులు కూడా పాల్గొన్నారు.

శిక్షణ ద్వారా మరింత నైపుణ్యం



ఎఫ్3 కార్ పనితీరును వివరిస్తున్న ట్రైనర్ రాహుల్‌రంజన్

పులివెందుల రూరల్, అక్టోబరు 25: శిక్షణ ద్వారా మరింత నైపుణ్యతను పెంపొందించుకోవచ్చని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ అరుణకాంతి విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని జేఎన్టీయూ కళాశాలలో యంత్ర- 2కె 24 జాతీయ సదస్సును రెండవ రోజైన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంకే ఇండస్ట్రీస్ ట్రైనర్ రాహుల్ రంజన్ ఎఫ్3 కార్ డిజైన్, పనితీరును విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు రామేశ్వరరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు చంద్రశేఖర్, రాజేష్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు సేవ చేయడం అభినందనీయం



యోగివేమన పశువైద్య విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీలతను సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు పశువైద్యులు సేవ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాలలో నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో మూగజీవాలకు సేవ చేయడం ఎంతో సంతృప్తిని, ఆనందాన్ని కలిగిస్తోందని తెలిపారు. మూగజీవాలపై ప్రేమతోనే పశువైద్య కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కళాశాల ఏర్పాటుకు చేసిన కృషిని, కష్టాన్ని గుర్తు చేసుకుని ఎమ్మెల్యే భావోద్వేగానికి గురయ్యారు. కళాశాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం పశువుల్లో పునరుత్పత్తి సమస్యలు, నివారణ చర్యలు, తక్కువ ఖర్చుతో సమీకృత దానా తయారీ వంటి అంశాల గురించి శాస్త్రవేత్తలు వివరించారు. జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజాకిశోర్ మాట్లాడుతూ జాతీయ సదస్సులో ఎనిమిది టెక్నికల్ సెషన్స్ జరిగాయన్నారు. అలాగే 16 లీడ్ పేపర్స్‌ను ప్రజంట్ చేశారని, 181 పరిశోధన పత్రాలను శాస్త్రవేత్తలు ప్రజంట్ చేశారన్నారు. అనంతరం ఉత్తమ పరిశోధన ఫలాలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ సీఈఓ ఎం.శ్రీనివాసరావు, పశువైద్య విశ్వవిద్యాలయం అధ్యాపకులు, పశువైద్య కళాశాల వైద్యులు, ఎస్‌జీఎస్‌బీటీ అధ్యక్షుడు డాక్టర్ థాని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురి మృతి




మృతులు సిద్దారెడ్డి, మన్సూర్

సికెదిన్నె, అక్టోబరు 25: మండల పరిధిలోని ఊటుకూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పొన్నోలు చిన్నసిద్దారెడ్డి (52), షేక్ మన్సూర్ (20) మృతి చెందారు. సికెదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ వివరాల మేరకు.. ఊటుకూరు గ్రామానికి చెందిన పొన్నోలు చిన్నసిద్దారెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. ఈయన గురువారం రాత్రి ఊటుకూరు నుంచి కడపకు వెళ్లేందుకు ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమీపంలోని ఓ లాడ్జి వద్దకు రాగానే కడప నుంచి బైకులో మన్సూర్ వేగంగా వచ్చి ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సిద్దారెడ్డి గురువారం రాత్రి, మన్సూర్ శుక్రవారం మృతి చెందారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, ఇరువురు మృతితో ఊటుకూరు గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఊటుకూరు మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు పొన్నోలు సుబ్బిరెడ్డి తమ్ముడు చిన్నసిద్దారెడ్డి కావడంతో వారి కుటుంబాన్ని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి పరామర్శించి సానుభూతి తెలిపారు. కుటుంబానికి పార్టీ అన్ని విధా లా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రమాదవశాత్తు బుగ్గవంకడ్యాంలో పడి విద్యార్థి మృతి

సికెదిన్నె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బుగ్గవంక డ్యాంలో గాలి ప్రేమ్ కుమార్(17) అనే విద్యార్థి గల్లంతై మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. గురువారం బుగ్గవంక డ్యాంను చూడటానికి ప్రేమ్‌కుమార్, తన నలుగురు మిత్రులతో కలిసి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. వారి స్నేహితులు ఎవరికి ఈత రాకపోవడంతో ఇంటికి వెళ్లి బంధువులకు తెలపడంతో వారు సికెదిన్నె పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. కాగా ప్రేమ్‌కుమార్ శ్రీహరి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఖాజీపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని చెన్నముక్కపల్లె వద్ద నాలుగు రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి సంబంధించి వివరాలు లేవు. ఎవరైనా ఇతన్ని గుర్తిస్తే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ లీకై వ్యక్తికి తీవ్ర గాయాలు



పెండ్లిమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండూరు హరిజనవాడలో వేంపల్లె వరపుత్రుడు అనే వ్యక్తి ఇంటిలో గ్యాస్ సిలిండర్ లీకేజీ అయ్యింది. దీంతో మంటలు రావడంతో ఇంట్లో ఉన్న వరపుత్రుడుకు తీవ్ర గాయాలయ్యాయి. శరీరం కాలడంతో నందిమండలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనలో కడప రిమ్స్‌కు తరలించారు.

స్థానిక అవసరాలకు ఇసుక ఉచితం

కడప కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుకను స్థానికుల అవసరాల కోసం వాగులు, వంకలు నుంచి ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల నుంచి తీసుకెళ్లవచ్చని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలని రాష్ట్ర గనులశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం రాజధాని అమరావతి నుంచి ఇసుక పాలసీ అమలు తీరుతెన్నులపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్, గనులశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్టరీ మాట్లాడుతూ ఇసుక పాలసీలో ఇసుక అవసరం ఉన్న ప్రతి వినియోగదారుడు పారదర్శకంగా ఇసుక తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక తీసుకొనేటపుడు సీనరేజ్ ఫీజును పూర్తిగా మాఫీ చేయడం జరిగిందన్నారు. ఇసుక రీచ్‌లు అందుబాటులో లేని ప్రజలకు ఆ ప్రాంత అవసరాలకు సరిపడే ఇసుక అందించే క్రమంలో స్టాక్ యార్డులు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. వాణిజ్యపరంగా ఉచిత ఇసుక విక్రయిస్తే కఠిన చర్యల తప్పవని హెచ్చరించారు. వీసీ ముగిసిన అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక డంప్‌ల నుంచి ఇసుకను రాత్రల్లో తరలిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో గనులశాఖ డీడీ సూర్య చంద్రరావు, గ్రౌండ్‌వాటర్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు

పెండ్లిమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్ర అయిన పొలతల దేవస్థానానికి శివపార్వతులను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చల్లని దొర, తహసీల్దార్ అనురాధలు తెలిపారు. పొలతలలోని టూరిజం భవనంలో శుక్రవారం మండలస్థాయి అధికారులతో కార్తీక మాస ఉత్సవాలపై అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం క్యూలైన్లు, పార్కింగ్ తదితర వాటిపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వాహణాధికారి కృష్ణానాయక్, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్టీసీ అధికారులు, రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.5.55 లక్షల విరాళం



ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న అరవింద స్కూలు యాజమాన్యం

ప్రొద్దుటూరు అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరదలతో తీవ్రంగా నష్టపోయిందని.. చంద్రబాబు కృషితో అక్కడ ప్రజలకు మెరుగైన పరిస్థితులు కల్పించారని.. అలాంటి ముఖ్యమంత్రికి అండగా నిలబడటానికి సహాయనిధి కింద రూ.5,55,555 అందజేస్తున్నట్లు అరవింద ఇంటిగ్రల్ స్కూలు కరస్పాండెంట్ వంకదార వీరభద్రయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎంఆర్‌కాలనీలోని అరవింద స్కూలులో ఇందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి అందజేశారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగల నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సీఎం సహాయ నిధికి రూ.5.5లక్షల విరాళం ఇవ్వడంపై ఆయన అభినందించారు. కార్యక్రమంలో కాశీపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని అంతం చేద్దాం

సికెదిన్నె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అవినీతిని అంతం చేద్దామని పవర్‌ గ్రిడ్‌ డీజీఎం హరివెంకట్‌కుమార్‌ తెలిపారు.కేఎస్‌ఆర్‌ఎం కాలేజీలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు.

డ్రోన్‌ కెమెరాలతో ట్రాఫిక్‌ పరిశీలన: సీఐ


డ్రోన్‌ కెమెరా పనితీరును వివరిస్తున్న సీఐ

కడప (క్రైం), అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ట్రాఫిక్‌ నియంత్రణ కోసం డ్రోన్‌ కెమెరాలను విని యోగిస్తున్నట్లు కడప ట్రాఫిక్‌ సీఐ జావీద్‌ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన ట్రాఫిక్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటించని వారిని గుర్తించి ఈ-చలానా ద్వారా జరిమానాలు విధిస్తామన్నారు. ఓవర్‌ స్పీడ్‌, సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌, త్రిబుల్‌ డ్రైవింగ్‌, రాంగ్‌ రూట్‌ డ్రైవింగ్‌లను గుర్తిస్తామన్నారు. ప్రధాన సర్కిళ్లతోపాటు ట్రాఫిక్‌ రద్దీ ఉన్న ప్రాంత్రాలలో డ్రోన్‌ కెమెరాలను వినియోగిస్తామన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్‌, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఓపీ పేరుతో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, అటువంటి ఆస్పత్రులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్‌ డిమాండ్‌ చేశారు. గురువారం కడప జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శివకుమార్‌ మాట్లాడారు.

దోమల వల్ల ప్రాణాంతక వ్యాధులు

పులివెందుల రూరల్‌, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దోమల వలన ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని మలేరియా సబ్‌ యూనిట్‌ అధికారి సిద్దయ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని యర్రగుడిపల్లెలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. లార్వా సర్వే నిర్వహించి నిల్వలు ఉన్న నీటిలో అబేట్‌ పిచికారీ చేసి ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, ఆశాకార్యకర్తలు నాగమణి, రాజమ్మ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌ చట్టరీత్యా నేరం: జడ్జి


యాంటి ర్యాగింగ్‌ అబ్జర్వెన్స్‌ డేను ప్రారంభిస్తున్న జడ్జి, ప్రిన్సిపాల్‌

కడప సెవెన్‌రోడ్స్‌, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌ చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ సెక్రటరీ, సివిల్‌ జడ్జి బాబాఫక్రుద్దీన్‌ పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ఆధ్వర్యంలో యాంటి ర్యాగింగ్‌ అబ్జర్వెన్స్‌డే నిర్వహించారు. అలాగే అనంతరం నూతన వైద్యవిద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ సెక్రటరీ, సివిల్‌ జడ్జి బాబాఫక్రుద్దీన్‌ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌ వల్ల కలిగే దుష్ఫలితాలు, దానికి విధించే శిక్షలను వివరించారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సురేఖ, వైస్‌ ప్రిన్సిపాల్‌ విజయభాస్కర్‌, ప్రొఫెసర్‌ హాస్టలు వార్డెన్‌ సునీల్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసరు రాజు దాసరి, వైద్యకళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శనగలో యాజమాన్య పద్ధతులు పాటించాలి


రైతులకు శనగలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

సీకేదిన్నె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు శనగ పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త వీరయ్య తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరులో బయోటెక్‌ కిసాన్‌హబ్‌ పథకంలో భాగంగా కొత్తరకం శనగ రకాలను, విత్తనశుద్ధి మందులను రైతులకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఈజీ 776 అనే రకం శనగ ప్రస్తుతం విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుందని తెగుళ్ల తట్టుకుని వంద రోజుల్లో పంట చేతికి వస్తుందన్నారు. ఎకరాకు 7 నుంచి 9 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుందన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు మహేష్‌బాబు, సాయిమహేశ్వరి పాల్గొన్నారు.



సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వేంపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సైబర్‌ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలియజేయాలని ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్‌, చైతన్య హైస్కూల్‌ కరస్పాండెంట్‌ చక్రపాణిరెడ్డి తెలిపారు. స్థానిక చైతన్య హైస్కూల్లో యువత-సైబర్‌ నేరాలపై పాత్రపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. ఎస్‌ఐ మా ట్లాడుతూ సైబర్‌ నేరాల గురించి తెలియజేశారు. ఎవరైనా సైబర్‌ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవనానికి అలవాటు పడాలని కోరారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ


ఎద్దుల శంకర్‌కు చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప (మారుతీనగర్‌), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నియోజకవర్గంలో 20 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.19,94,591ను శుక్రవారం ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ద్వారకానగర్‌లోని వారి నివాసంలో పంపిణీ చేశారు. ఇందులో భాగంగా పాత కడపకు చెందిన ఎద్దుల రాజ్యలక్ష్మికి రూ.5.5 లక్షల చెక్కును అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధిని పక్కనపెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. మధ్యతరగతి, పేద కుటుంబాల వారు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.





పశుగణన సర్వే పక్కాగా నిర్వహించాలి

సింహాద్రిపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) పశుగణన సర్వేను పక్కాగా నిర్వహించాలని పులివెందుల పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ మంగేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం సింహాద్రిపురంలో 21వ పశుగణన సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ శివప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం

వేంపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని త్వరలో మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. వేంపల్లె మండలం ఇడుపులపాయ రైతు సేవా కేంద్రాన్ని, వేంపల్లె వ్యవసాయ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు.

విత్తనశుద్ధి తప్పక పాటించాలి

పెండ్లిమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంట సాగుచేసే రైతులు విత్తన శుద్ధిని తప్పనిసరిగా పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం బాలయ్యగారిపల్లె, గుర్రాలచింతపల్లె ఉల్లి సాగులో అధిక దిగుబడుల కోసం ఆచరించాల్సిన పద్ధతులను వివరించారు.

అంతర్‌పంటల ద్వారా అధిక లాభాలు

వేముల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ అంతర్‌ పంటల ద్వారా అధిక లాభాలు సాధిచవచ్చని యూనిట్‌ ఇన్‌చార్జి రామ్మోహన్‌నాయుడు అన్నారు. శుక్రవారం వేములలో రైతులకు పొలంలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేశారు. వెంకటేశ్‌, రాజీవ్‌రెడ్డి, రైతులు గంగాధర, రామకృష్ణారెడ్డి, రమణమ్మ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, కడప ఉక్కు ఊసేదీ?

పులివెందుల టౌన్‌, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హోదా అమలు, కడప స్టీలు ప్లాంటుపై ఊసే లేదని పులివెందుల కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్‌ ధృవకుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయం లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ ప్రత్యేక హోదా అమలుకు కేం ద్రంపై వత్తిడి తేవాలన్నారు.

సభ్యత్వ నమోదులో పాల్గొనండి

పెండ్లిమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విరివిగా పాల్గొనాలని టీడీపీ మండల అధ్యక్షుడు సంగటి గంగిరెడ్డి తెలిపారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని, కావున టీడీపీ కుటుంబ సభ్యులు కార్యకర్తలు మీపేరు నమోదు చేసుకోవాలన్నారు. సభ్యత్వం ఉన్న వారికి ప్రమాద బీమా ఉంటుందని తెలిపారు.

నేడు టీడీపీ సభ్యత్వ నమోదు

పులివెందుల టౌన్‌, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):టీడీపీ జాతీయ అధ్యక్షుడు, నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మే రకు శనివారం ఉదయం 11 గంటలకు పులివెందుల పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తా మని ఇన్‌చార్జ్‌ రవీంద్రనాథరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ నాయకులు, మండల అధ్యక్షుడు, క్లస్టర్‌, యూనిట్‌, బూత్‌ ఇన్‌చార్జ్‌ పాల్గొనాలని ఆయన కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

కమలాపురం రూరల్‌, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. శుక్రవారం కమలాపురం నగర పంచాయతీ వద్ద పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో డీసీసీ బ్యాంకు ఆవరణంలో అర్బన్‌ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు ఇస్తున్న రుణాలు డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాలిటెక్నిక్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ఆయన సందర్శించారు. నగర పంచాయతీ క మిషనర్‌ జగన్నాథం, మెప్మా పట్టణ కో ఆర్డినేటరు నాగేంద్ర, లావణ్య, ప్రజోద్‌కుమార్‌, టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, వాసుదేవరెడ్డి, రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, జంపాల నరసింహారెడ్డి, దాదిరామయ్య, ప్రసాద్‌రెడ్డి, రెడ్డికరీం పాల్గొన్నారు.

పశుగణను సద్వినియోగం చేసుకోవాలి


వల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పశుగణను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం మాచిరెడ్డిపల్లెలో పశుగణనకు సంబంధించి పశువైద్య అధికారులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ వద్దకు వచ్చే సిబ్బందికి ఆవులు ఎద్దులు, గేదెలు గొర్రెలు, మేకలు, కోళ్లు, కుక్కలు వంటి అన్ని పెంపుడు జంతువులతో సహా పూర్తి వివరాలను అందజేస్తేనే పూర్తి సహకారం అందుతుందన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్‌ ఫండ్‌

సీకేదిన్నె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరంలాంటిదని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో సీఎం సహాయ నిధి అందజేశారు. మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్‌ గంధం మోహన్‌బాబు, వివిధ మండలాల టీడీపీ ఇన్‌చార్జిలు, బాధితులు పాల్గొన్నారు.











పశువుల అభివృద్ధికి కృషి చేయాలి

— ఎమ్మెల్యే వరద —

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పశువుల అభివృద్ధికి పశుసంవర్ధకశాఖ అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కామనూరులో నియోజకవర్గస్థాయి 21వ పశుగణాంకాల సర్వేను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు పాడిపరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తారని, వారికి పశువుల ద్వారా మేలు చేకూర్చేలా కృషి చేయాలన్నారు. ఏపీఎల్‌డీఏ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 25వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి చివరి వరకు దేశవ్యాప్తంగా పశుగణాంకాల సర్వే జరుగుతుందని తెలిపారు. యానిమేటర్లకు రైతులు, పశువుల యజమానులు తమ పశువులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించాలని కోరారు. సర్వే ఆధారంగా పశువుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుం దన్నారు. వివిధ పథకాల ప్రణాళికలు తయారు చేయడానికి ఈ సర్వే తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ శారద, డీఎల్‌డీఏ సీఈఓ డాక్టర్ రమేష్‌బాబు, పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ వీరబ్రహ్మం, ప్రొద్దుటూరు సహాయ సంచాలకులు డాక్టర్ ధనుంజయరెడ్డి, రాజుపాళెం సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ఇంటింటికీ వెళ్లి పశుగణన....

ముద్దనూరు అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ వెళ్లి పశుగణన చేస్తున్నట్లు ఇన్‌చార్జి పశువైద్యశాల ఏడీ శ్రీనివాస తెలిపారు. సోమవారం వరకు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు, కోళ్లు, ఒంటెలు, గుర్రాలు, గాడిదలు లెక్కిస్తామన్నారు. పశువైద్యురాలు హిమబిందు, సుధీర్, ధరణి,శశిరేఖ, నాగుమయ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్స్ విడుదల

ఎర్రగుంట్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో పశుగణన ప్రారంభించారు. అఖిల భారత పశుగణనలో భాగంగా కమిషనర్ శేష పణి, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరక్టర్ మునయ్య, వీఎన్‌పల్లె పశువైద్యాధికారి సునీల్ వాల్‌పోస్టర్స్‌ను విడుదల చేశారు. మండలంలో శిక్షణ తీసుకున్న ఎన్యుమరేటర్స్ సూపర్‌వైజర్లు పాల్గొంటారన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తారన్నారు. సుమారు 22వేల ఇళ్లు ఉన్నట్లు వీటిపై పూర్తి సర్వేచేసి నివేదిక ఇస్తారని ఏడీ తెలిపారు.

బహిరంగ ప్రకటన

నా కక్షిదారుడు అయిన పీరపురెడ్డి సునీల్ కుమార్ రెడ్డి తండ్రి పీరపురెడ్డి వెంకట సుబ్బారెడ్డి, డోర్.నెం. 1/12,రామిరెడ్డికుంట గ్రామం,కలవకుంట్ల పోస్ట్,పోరుమామిళ్ల మండలం,కడప జిల్లా వారు ఇచ్చిన సూచనల మేరకు యావన్మంది ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియచేయు బహిరంగ ప్రకటన ఏమనగా.... నా కక్షిదారుడు అయిన పీరపురెడ్డి సునీల్ కుమార్ రెడ్డి తండ్రి పీరపురెడ్డి వెంకట సుబ్బారెడ్డిగారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని కత్తెరపల్లి వెంకట సుబ్బారెడ్డి తండ్రి కత్తెరపల్లి నడిపి సుబ్బారెడ్డిగారి నుండి 30-09-2021 తేదిన దస్తావేజు నెం. 4593/2021గా విక్రయ దస్తావేజు రీత్యా పొందివున్నారని, సదరు కత్తెరపల్లి వెంకట సుబ్బారెడ్డిగారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని తన భార్య అయినటువంటి కత్తెరపల్లి ఉష మరియు బోరెడ్డి రామిరెడ్డిగార్ల నుండి 05-08-2015 తేదిన దస్తావేజు నెం.1163/2015 ద్వారా విక్రయించుకొని వున్నారు, సదరు కత్తెరపల్లి ఉష మరియు బోరెడ్డి రామిరెడ్డిగార్లు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని కల్లూరి వెంకట నారాయణరెడ్డి తండ్రి వెంకటరెడ్డిగారి నుండి 09-04-2012 తేదిన దస్తావేజు నెం.945/2012 ద్వారా విక్రయించుకొని వున్నారు. క్రింది షెడ్యూలు లింకు దస్తావేజు అయిన ఒరిజినల్ విక్రయ దస్తావేజు నెం.945/2012గల దస్తావేజు,09-10-2024న పోరుమామిళ్ల పట్టణంలో బ్రాంచ్ సెంటర్ వద్ద పోయినది అని, ఎంత వెతికినను దొరకలేదు అని తెలియచేస్తున్నాము. కావున క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి ఎవ్వరికైనను ఎటువంటి హక్కులు కాని,అధికారము కాని,ఆక్షేపణలు కాని,వున్న యెడల ఈ దినంనుండి 15 రోజుల లోపల తగు సంబంధిత దస్తావేజులతో నా యెదుట హాజరు అయి ఆక్షేపణలు తెలియచేయవలెను. లేనియెడల క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి ఎవ్వరికీ హక్కులు కాని, అధికారము కాని, ఆక్షేపణలు కాని లేవని భావించి తేది.09-04-2012 దస్తావేజునెం. 945/2012ను నకలును స్వీకరించబడును. షెడ్యూలు : కడప డి.బద్వేలు సబ్.డి.పోరుమామిళ్ల మండలం,రంగసముద్రం పంచాయితీ,6వ వార్డు పీకర్ పెకన్ ఏరియా లేక నెం.6/60యకు చాలా దూరంలో రంగసముద్రం గ్రామపొలంలో నాకు హక్కుకలిగిన స్వాధీనంలోగల సర్వేనం.1108/2కు య1.69 సెంట్లు పైకి నాకుగల య0.84సెంట్లు పైకి ప్లాట్ నెం. 9కు య0.05 సెంట్లు లేక 0.020 హెక్టార్లుగల జాగాకు హద్దులు: తూర్పు16 అడుగుల వెడల్పుగల రస్తా, పడమర : మూగివార్ల సుబ్బమ్మ స్థలం. ఉత్తరం : ప్లాట్ నెం. 8కుగల జాగా. దక్షిణం : ప్లాట్ నెం.10కు గల జాగాలో ఇల్లు.

P.GOUTHAM KUMAR, ADVOCATE, D.No.3/2056, Maruthi Nagar, Kadapa, Cell : 9948097507

మెడికల్ క్యాంపులు నిర్వహించండి : డీఎంహెచ్ఓ

ముద్దనూరు అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీగిరి కాలనీలో మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఎప్పటి కప్పుడు పరిస్థితులపై జాగ్రత్తలు పాటించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ ఉమామహేశ్వరరావు మెడికల్ సిబ్బందికి సూచించారు. ఎస్సీగిరి కాలనీలో డెంగ్యూ ప్రభావం ఎక్కువగా ఉండడంతో శుక్రవారం ఆయన కాలనీలో పర్యటించారు పారిశుధ్య లోపం ఉన్న ప్రాంతాలు, నీటి తొట్లను పరిశీలించారు. మురికి నీరు నిల్వ ఉన్న కాల్వలో ఆయిల్ బాల్స్‌ను వేయించారు. ఎస్సీగిరి కాలనీలో డెంగ్యూ లక్షణాలు ఉన్నాయన్నారు. ఆరుగురు ప్రాథమిక దశలోనే రికవరీ కాగా ముగ్గురి రక్త నమూనాలను పరీక్షకు పంపామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్షుమయ్య, డీఎంహెచ్ఓ కార్యాలయం సబ్‌యూనిట్ అధికారి ప్రసాద్, డాక్టర్ కరిష్మ, ల్యాబ్‌టెక్నీషియన్ జాసన్, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందుల అంగళ్ల తనిఖీ

దువ్వూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పురుగు మందుల అంగళ్లను మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మందుల శ్యాంపిల్స్‌ను తీసి ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిబంధనల మేరకు అంగళ్ల యజమానులు నడుచుకోవాలని సూచించారు.

రోడ్ల నిర్మాణంపై శిక్షణ

జమ్మలమడుగు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతిక విధానంలో గ్రామీణ రోడ్ల నిర్మాణంలో శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ కార్యాలయం సభాభవనంలో డివిజన్‌స్థాయిలో పంచాయతీరాజ్ అధికారులకు, సిబ్బందికి నూతన సాంకేతిక విధానంలో సీసీ రోడ్ల నిర్మాణంపై శిక్షణలో నూతన సాంకేతిక విధానాన్ని వివరించారు. గ్రామీణ బీటీ రోడ్ల నిర్మాణంలో జియో సింథటిక్స్ వాడకంపై చర్చించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతపై సూచనలు ఇచ్చారు. రోడ్ల నిర్మాణం, దృఢత్వం, స్థిరత్వాన్ని పెంచాలనే ఈ శిక్షణను ఏర్పాటు చేసినట్లు ఏస్ఈ శ్రీనివాసరెడ్డి వివరించారు. జియోసింథటిక్స్ టెక్నాలజీ, నేల స్థిరీకరణ, మన్నిక కలిగిన రహదారుల నిర్మాణానికి ఉపయోగపడుతుందన్నారు.

ఉల్లిపంటను పరిశీలించిన ఉద్యాన శాఖ



దువ్వూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాలకు దెబ్బతిన్న ఉల్లిపంటను శుక్రవారం ఉద్యానశాఖ అధికారి రామక్రిష్ణ సిబ్బందితో కలిసి పరిశీలించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో దెబ్బతిన్న ఉల్లిపంట అనే శీర్షికన ప్రచురితమైన కథనంతో మదిరేపల్లె, చిన్నసింగనపల్లి, నీలాపురం, దాసరిపల్లె గ్రామాల్లో రైతులతో కలిసి పొలాల్లో అధికారులు కలియతిరిగారు మందుల పిచికారీ, ఎరువుల వాడకం లాంటి విషయాలపై రైతులకు అవగాహన కలిగించారు. వ్యవసాయ శాఖ నిబంధనల మేరకు తాము నడుచుకుంటున్నామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో రైతుల వెంట ఉద్యానవన సహాయకులు సమీరా, ఈశ్వరి పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్శిటీ అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీల్లో వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి తెలిపారు. గురువారం బద్వేలులోని ఎస్‌బీవీఆర్ కళాశాలలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉమెన్స్ డబుల్స్ విభాగంలో జయశ్రీ, వాణి, మానస మొదటిస్థానంలో నిలిచారు. సింగిల్స్‌లో నిరీష ద్వితీయ స్థానం సాధించింది. మెన్స్ డబుల్స్‌లో గోపాల్, రవితేజ, వర్షిత్ తృతీయస్థానం సాధించారు. చెన్నైలో జరిగే అంతర్ యూనివర్సిటీ పోటీలకు వర్షిత్ యోగివేమన యూనివర్శిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు.

సభ్యత్వ నమోదును చేపట్టాలి : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ నియోజకవర్గానికి విధించిన టార్గెట్‌ను పూర్తిచేసేలా ఇన్‌చార్జులు కలిసి కట్టుగా సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భూసమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలని వినతి

కాశినాయన అక్టోబరు(ఆంధ్రజ్యోతి)25: భూసమస్యల పరిష్కారంపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు పి.రవీంద్రారెడ్డి, బూత్ కన్వీనర్ వడ్డమాను విజయ్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం నర్సాపురం తహసీల్దారు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు వెంకటసుబ్బయ్య, డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్‌ను మర్యదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఓ.రోహిత్‌రెడ్డి, ఎల్.శ్రీనివాసులరెడ్డి, బి.వెంకట్రామిరెడ్డి, బి.నరసింహారెడ్డి పాల్గొన్నారు.


తహసీల్దారును సత్కరిస్తున్న టీడీపీ నేతలు

మున్సిపల్ మాజీ చైర్మన్ ముసలయ్య మృతి

ఎర్రగుంట్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నగరపంచాయతీ మొట్టమొదటి చైర్మన్ హనుమనగుత్తి ముసలయ్య(70) శుక్రవారం కడపలో మృతిచెందాడు. ఎర్రగుంట్లకు చెందిన ముసలయ్య ఇండియా సిమెంట్స్ లిమిటెడ్‌లో ఉద్యోగిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేశాడు. ఎర్రగుంట్ల చైర్మన్ పదవి బీసీలకు కేటాయించడంతో ఆయనకు వైసీపీ నుంచి ఆఫర్ వచ్చింది. దీంతో 2014లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆయన 15వ వార్డు కౌన్సిలర్‌గా గెలిచి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. శుక్రవారం సాయంత్రం కడపలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎర్రగుంట్లకు చెందిన మాజీ కౌన్సిలర్లు, ఇతర ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.


ముసలయ్య (ఫైల్‌ఫొటో)

నర్సుల సమస్యలను పరిష్కరిస్తాం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రుల్లో పనిచేసే నర్సుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి లిల్లీఫ్లోరెన్స్ పేర్కొన్నారు. అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన ఆమెను శుక్రవారం సాయంత్రం ఎన్జీవో హోంలో ఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ప్రొద్దుటూరు తాలూకా ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు సదాశివ, కోశాధికారి ప్రమీల, ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రభంజన్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ జయంతి, ఉమెన్ జాయింట్ సెక్రటరి సంధ్యారాణి, మధు, నాగరాజు, శివరామానుజం పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం పెరగాలి

ప్రొద్దుటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాలేజీ స్థాయినుంచే మహిళల్లో సామాజిక చైతన్యం పెపొందండే మహిళలపై హింసను కేవలం చట్టాలతో అరికట్టలేమని మహిళా జేఏసీ నేతలు వెల్లడించారు. గీతం మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు లైగింక వేధింపులు హింస, పోర్న్ వియోల నిషేధం మద్యపాన నిషేధం డ్రగ్స్ పై అవగాహన కల్పించారు.

డీలర్లతో సమావేశం

దువ్వూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు రెవెన్యూ కార్యాలయంలో చౌక దుకాణ డీలర్లతో తహసీల్దారు ఇక్బాల్‌బాష సమావేశం నిర్వహించారు. సరుకులు పంపిణీ చేయాలని, తూకాలు కచ్చితంగా ఉండాలన్నారు.

సుందరయ్య కాలనీలో గ్యార్మీ వేడుకలు

పోరుమామిళ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం పంచాయతీ సుందరయ్యకాలనీ మహబూబ్‌సుబానీ దర్గాలో గ్యార్మీ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం నిర్వాహకులు పురవీధుల్లో జెండాను, గంధంను ఊరేగింపు చేపట్టారు. అనంతరం దర్గాలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించి అన్నదానం చేశారు.